### తెలుగు కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తెలుగుయూనివర్సిటీ, మే 8 : తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల(సాయంత్రం)లో వివిధ తెలుగు కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జె.చెన్నయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాషా సాహిత్యాలలో కొనసాగుతున్న కోర్సులకు గాను ప్రీ డిగ్రీ కోర్సుకు పదవ తరగతి ఉత్తీర్ణులైనవారు అర్హులని, ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన వారు బీఏ లాంగ్వేజెస్‌కు డిగ్రీ ఆన్‌లైన్ సిస్టం(దోస్త్) ద్వారా ప్రవేశం పొందవచ్చన్నారు. తెలుగు ద్వితీయ భాషగా ఉత్తీర్ణులైనా వారు ఎమ్మే లాంగ్వేజెస్ కోర్సుకు అర్హులన్నారు. ఈ కోర్సులు చదివిన వారు తెలుగు పండితులుగా, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో అధ్యాపకులుగా, అధికారులుగా, పాత్రికేయులుగా స్థిరపడవచ్చన్నారు. పై కోర్సులు చదువుకోవాలనే ఆసక్తి ఉన్నవారందరూ సాయంత్రం 5 నుండి రాత్రి 9గంటల వరకు ఈ కళాశాలలో చేరి తరగతులకు హాజరుకావచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9441085114, 9032812971లలో సంప్రదించవచ్చునని సూచించారు.

### ముంబై కెమ్‌ఎక్స్‌పోలో ఐఐసీటీ ప్రదర్శన

సిటీబ్యూరో, మే 8(నమస్తే తెలంగాణ) : ముంబైలో జరుగుతున్న కెమికల్ ఎక్స్‌పోలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ ఉత్పత్తులు, పరిశోధనలు ప్రదర్శించింది. రెండు రోజుల జాతీయ స్థాయి ప్రదర్శనలో ఐఐసీటీ బృందం ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించింది. ఐఐసీటీ సైంటిస్ట్ శైలజారెడ్డి నేతృత్వంలో వెళ్లిన పరిశోధన బృందం ఈ కెమ్‌ఎక్స్‌పోకు హాజరైంది. ఈ నేపథ్యం కరోనా మహమ్మారి సమయంలో ఐఐసీటీ చేసిన కృషి, వ్యాక్సిన్ తయారీలో పోషించిన పాత్ర, గ్రీన్ ఎనర్జీ ఉత్పాదక పరిశోధనలతో సాధించిన విజయాలను ప్రదర్శించారు.

# బీఆర్‌ఎస్ పాలనలో అన్ని మతాలకు గౌరవం

- మైనార్టీల అభివృద్ధికి కోట్లు వెచ్చించాం
- మైనార్టీల ఆత్మీయ సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



మౌలాలి డివిజన్‌లోని బంజారా ఫంక్షన్ హాల్‌లో జరిగిన మైనార్టీ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

మల్కాజిగిరి, మే 8: మైనార్టీల అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్ కృషి చేస్తుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం మల్కాజిగిరి సర్కిల్ మౌలాలి డివిజన్‌లోని బంజారా ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మైనార్టీ ఆత్మీయ సమావేశానికి కేటీఆర్, మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పదేండ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ప్రజలంతా జన్‌ధన్ బ్యాంకు ఖాతాలు తెరవమని, విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకొచ్చి అకౌంట్‌లలో రూ.15లక్షలు వేస్తానని మోదీ అన్నారని, పదేండ్లు అవుతున్నా.. బ్యాంకు ఖాతాల్లో ఒక్క రూపాయి పడలేదని అన్నారు. పేదలకు ఇండ్లు కట్టిస్తామని, నల్లా పెట్టిస్తామని చెప్పి..మాట మరిచారన్నారు. కేసీఆర్ పాలనలో మైనార్టీల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించినట్లు చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ అన్ని మతాలను సమానంగా గౌరవించారని, యాదాద్రి దేవాలయాన్ని నిర్మించారన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంబీసీ మాజీ చైర్మన్ నందికటి శ్రీధర్, మైనారిటీ నాయకుడు మౌలాన, కార్పొరేటర్లు, సునీతరాము యాదవ్, శాంతిశ్రీనివాస్ రెడ్డి, సబితాకిశోర్, మురుగేశ్, మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్, అనిల్‌కిశోర్, జేఏసీ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# సర్వేలన్నీ.. పజ్జన్నవైపే..!

బీజేపీకి రెండు, కాంగ్రెస్‌కు మూడవ స్థానం

దానం ఒక్కడే కాంగ్రెస్‌లోకి.. క్యాడరంతా బీఆర్‌ఎస్‌లోనే

- మరో ఐదు రోజుల పాటు ఇదే ఊపును కొనసాగించాలి
- పోలింగ్ ముగిసేదాకా బీఆర్‌ఎస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి
- తెలంగాణ భవన్‌లో ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్, ముఖ్య నాయకులతో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సమావేశం



తెలంగాణ భవన్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నేతలతో సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బంజారాహిల్స్, మే 8 : సికింద్రాబాద్ పార్లమెంట్ గడ్డపై గులాబీజెండా ఎగురడం ఖాయమని, స్పష్టమైన సంకేతాలు ఉన్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి పద్మారావు గౌడ్, హైదరాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్, దాసోజు శ్రవణ్ కుమార్, ఖైరతాబాద్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి ఎంఎన్.శ్రీనివాస్‌తో పాటు ముఖ్య నేతలతో బుధవారం మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సమావేశమయ్యారు. రెండు గంటల పాటు నాయకులతో చర్చించడంతో పాటు వివిధ సర్వే సంస్థల అంచనాలను నాయకులకు వివరించారు. సికింద్రాబాద్ పార్లమెంట్‌లో సిట్టింగ్ బీజేపీ ఎంపీ కిషన్‌రెడ్డి మీద ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నదని, ఖచ్చితంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుకు మద్దతు పలుకుతామని ఓటర్లు చెబుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ పోటీ బీజేపీతోనే అని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ మూడో స్థానానికే పరిమితం కానున్నట్లు అన్ని సర్వేలలో తేలిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ పట్ల మొగ్గు కనిపిస్తోందని, ఖచ్చితంగా మెజార్టీ స్థానాలు బీఆర్‌ఎస్‌కు దక్కనున్నాయన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లినా చాలా మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్‌తోనే ఉండి కష్టపడి పని చేస్తున్నారని ప్రశంసించారు. మరో ఐదు రోజుల పాటు ఇదే ఊపును కొనసాగించాలని, పోలింగ్ ముగిసేదాకా బీఆర్‌ఎస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్రనేత కే.విప్లవ్ కుమార్, నియోజకవర్గం ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్ పర్సన్ ప్రసన్న రామ్మూర్తి, కార్పొరేటర్లు వెల్దండ వెంకటేష్, మన్నె కవితారెడ్డి,మాజీ కార్పొరేటర్ హేమలతాయాదవ్‌తో పాటు అన్ని డివిజన్ల బీఆర్‌ఎస్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### పజ్జన్నకు క్రిస్టియన్ మైనార్టీ కమిటీ సంపూర్ణ మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, మే 8 : సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు సనత్‌నగర్ క్రిస్టియన్ మైనార్టీ కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బుధవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో కమిటీ సభ్యులు కలిసి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నిత్యం ప్రజల మధ్యన ఉండే పద్మారావుకు వివిధ వర్గాల ప్రజలు మద్దతు తెలుపుతున్నాయని చెప్పారు. పజ్జన్న గెలుపు ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజీవ్‌సాగర్, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ పార్టీ బూత్ లెవల్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మర్రి, ఇన్‌చార్జి రావుల, బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదిత, బోర్డు మాజీ సభ్యులు

# మీ ఆడబిడ్డను ఆశీర్వదించండి..!

## ఐదు రోజులు కష్టపడండి.. ఐదేండ్లు మీకు సేవ చేస్తా..

- ఎన్నికల ప్రచారంలో కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి నివేదిత
- బీఆర్‌ఎస్ పథకాలు, సాయన్న ప్రజాసేవ.. నివేదితకు బారీ మెజార్టీ ఖాయం
- బూత్ లెవల్ సమావేశంలో ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి
- కాంగ్రెస్‌కు నేతలు, క్యాడర్ లేరు : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్, మే 8 : వచ్చే ఐదు రోజులు ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత గెలుపుకోసం కృషి చేయాలని గులాబీ శ్రేణులకు కంటోన్మెంట్ ఎన్నికల బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఐదు రోజులు కష్టపడితే ఐదేళ్ల పాటు నివేదిత సాయన్న ప్రజలకు సేవ చేస్తారని వెల్లడించారు. గత ఎన్నికల కంటే రెట్టింపు మెజార్టీ సాధించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. బుధవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని డ్రీమ్ ల్యాండ్ గార్డెన్స్‌లో బీఆర్‌ఎస్ బూత్ లెవల్ మీటింగ్ నిర్వహించారు. సమావేశంలో రావుల శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ కంటోన్మెంట్‌లో కాంగ్రెస్, బీజేపీల అడ్రస్ గల్లంతేనని తేల్చిచెప్పారు. కేసీఆర్ చేసిన మంచి పనులు, దివంగత ఎమ్మెల్యే సాయన్న ప్రజాసేవ అన్నీ కలిసి నివేదిత విజయానికి దోహదం చేస్తాయని ధీమా వ్యక్తం చేశారు. మల్కాజిగిరి ఎంపీ స్థానంతో పాటు కంటోన్మెంట్‌లోనూ గులాబీజెండా ఎగురవేస్తామన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత సాయన్నకు ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డితో పాటు తాను కూడా అండగా ఉన్నానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. మచ్చలేని నాయకుడు దివంగత ఎమ్మెల్యే సాయన్న అని కొనియాడారు. సొంత బిడ్డల కోసం కూడా ఆలోచించకుండా కంటోన్మెంట్ ప్రజల కోసం పాటుపడిన గొప్ప నాయకుడు సాయన్న అని కీర్తించారు. అలాంటి మహానుభావుడి కుమార్తె నివేదితను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. కాంగ్రెస్‌కు నేతలు, క్యాడర్ లేరని.. బీఆర్‌ఎస్‌కు సముద్రమంత విశాలమైన గులాబీ కుటుంబ సభ్యులున్నారని వెల్లడించారు. గులాబీ సైనికులంతా అహర్నిషలు శ్రమిస్తున్నారని, నివేదిత గెలుపు పక్కా అని మర్రి రాజశేఖర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. గులాబీ పార్టీకి మూలస్తంభాలు క్యాడరేనని కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత సాయన్న స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో గులాబీశ్రేణుల కృషి ఫలితంగానే లాస్యనందిత విజయం సాధించారని గుర్తుచేశారు. ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన సాయన్నకు తాను కుమార్తెగా పుట్టడం తన అదృష్టమన్నారు. సాయన్న, లాస్యనందితలాగే.. తనను కూడా ప్రజలంతా ఆశీర్వదిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కంటోన్మెంట్ ప్రజలంతా సాయన్న కుటుంబ సభ్యులేనన్నారు. కంటోన్మెంట్ ప్రజలు కూడా తనను సొంత ఆడబిడ్డలా భావించి మద్దతు పలకాలని విన్నవించారు. ముఖ్యంగా తన గెలుపు కోసం శ్రమిస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి, రావుల శ్రీధర్ రెడ్డికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, భాగ్యశ్రీ శ్యాంకుమార్, లోక్ నాథ్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప హరి, సీనియర్ నాయకులు టీఎన్ శ్రీనివాస్, ఆకుల హరి, సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళానేతలు, ఉద్యమకారులు, సాయన్న అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆటో డ్రైవర్ల కన్నెర్ర

- 150 రోజుల పాలనలో 24మంది డ్రైవర్లను బలిగొన్నారు
- అసెంబ్లీ ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చి.. అధికారంలోకి రాగానే నయవంచన
- డ్రైవర్ల జీవనోపాధిని దెబ్బ తీసిన కాంగ్రెస్‌కు బుద్ధిచెబుతాం
- నేటి రౌండ్ టేబుల్ సమావేశంలో కార్యాచరణ ప్రకటిస్తాం
- డ్రైవర్లంతా బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతుగా ప్రచారం



మీడియాతో మాట్లాడుతున్న ఆటో, క్యాబ్ సంఘాల నాయకులు

సిటీబ్యూరో, మే 8 ( నమస్తే తెలంగాణ ) : కాంగ్రెస్‌పై డ్రైవర్లు కన్నెర్ర చేస్తున్నారు. తమ ఉపాధిని దెబ్బతీసి చోద్యం చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి లోక్ సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిన తరుణం వచ్చిందని డ్రైవర్లంతా ఒక్కటవుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ''ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తాం.. ఓలా, ఉబర్, ర్యాపిడోల కమీషన్ల దందాకు చెక్ పెడుతాం.. ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తాం'' తదితర హామీలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వాటన్నింటిని అమలు చేయకుండా మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ఉచిత బస్సు స్కీంతో ఆటో డ్రైవర్లను నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే గురువారం సుందరయ్య విజ్ఞాన భవన్‌లో ఆటో, క్యాబ్ సంఘాల నాయకులంతా కలిసి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా టీఏటీయూ ఆటో యూనియన్ అధ్యక్షుడు వేముల మారయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 150 రోజులు గడించిందని.. డ్రైవర్లు 24 మందికిపైగా మరణించినా పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. రవాణా శాఖ మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్ డ్రైవర్లకు న్యాయం చేస్తామని అనేక సమావేశాల్లో చెప్పి.. ఇప్పటికీ ఏ ఒక్క పని కూడా చేయలేదని మండిపడ్డారు. దీనికి తోడు మళ్లీ లోక్ సభ ఎన్నికల్లో డ్రైవర్లను మోసం చేయడానికి పత్రికల్లో యాడ్స్ ఇస్తూ డ్రైవర్లకు న్యాయం చేస్తామని చెబుతున్నారు. ఈసారి కాంగ్రెస్ నయవంచక మాటలకు మోసపోయే పరిస్థితిలో డ్రైవర్లు లేరని చెప్పారు. కచ్చితంగా కాంగ్రెస్‌ను ఓడించడానికి రాష్ట్రమంతా డ్రైవర్లు సంసిద్ధమయ్యారని వివరించారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై గురువారం జరిగే రౌండ్ టేబుల్ సమావేశం ద్వారా కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఇప్పటికే డ్రైవర్లంతా బీఆర్‌ఎస్ పార్టీకి మద్ధతుగా ప్రచారం నిర్వహిస్తున్నారని అన్నారు.

## కందుకూరు మెడికల్ కాలేజీని

**ఆడపడచుల పట్ల చులకనగా మాట్లాడడం తగదు**

# కొడంగల్‌కు ఎత్తుకెళ్లిన రేవంత్



కందుకూరు రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి కాసాని, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్

మెట్రో, పార్మాసిటీలను ఎందుకు రద్దుచేశారో చెప్పాలి

ఆడబిడ్డలకు స్కూటీలు ఎందుకు ఇవ్వలే రేవంత్..?

- ఆరు గ్యారెంటీలు ఎగ్గొట్టిన కాంగ్రెస్‌కు ఓటెందుకు వేయాలి
- కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. చేవెళ్లకు చేసింది గుండు సున్న
- 96 బీసీ కులాలు ఏకమై బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- కందుకూరు రోడ్ షోలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



రోడ్‌షోకు భారీగా హాజరైన జనం

కందుకూరు/బడంగ్‌పేట, మే 8 : ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఎందుకు నీకు చేవెళ్ల ప్రజలు ఓటు వేయాలని ప్రశ్నించారు. బీసీలు అంతా ఏకమై బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి కందుకూరులో హైదరాబాద్, శ్రీశైలం రహదారితో పాటు మహేశ్వరం మండల కేంద్రంలో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌లతో కలిసి రోడ్ షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ కందుకూరులో మంజూరైన మెడికల్ కళాశాలను సీఎం రేవంత్ రెడ్డి రద్దు చేసి కొడంగల్‌కు తీసుకువెళ్లారని అన్నారు. మెట్రో, పార్మాసిటీలను ఎందుకు రద్దుచేశారని ప్రశ్నించారు. ఆడబిడ్డల పట్ల చులకనగా మాట్లాడుతున్నారని, తన పట్ల ఇష్టాను సారంగా మాట్లాడడం తగదని మండిపడ్డారు. తాను రాత్రి సమయంలో బీజేపీకి, ఉదయం సమయంలో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రచారం చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారని, తనకు బీజేపీకి ప్రచారం చేయాల్సిన గతి పట్టలేదని తెలిపారు. రైతుల రుణమాఫీ, రూ.500లకు గ్యాస్, రూ.4వేల పింఛన్, ప్రతి ఇంట్లో మహిళకు రూ.2500, 24 గంటల విద్యుత్ ఎగ్గొట్టినందుకు కాంగ్రెస్‌కు ఓటువేయాలా.. అని ప్రశ్నించారు. మహిళలకు స్కూటీలు ఇస్తామని ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఉచిత బస్సు పెట్టి మహిళలకు కొట్లాట మొదలు పెట్టారని అన్నారు. రేవంత్ రెడ్డి ఎక్కడ పోతే అక్కడ దేవుడి మీద ఓట్లు పెడుతున్నారని, చివరకు రేవంత్ రెడ్డిని చూసి దేవుడు కూడా పారిపోయే పరిస్థితి ఉందన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేసిన అభివృద్ధి ప్రజల ముందు కదలాడుతుందన్నారు. తుక్కుగూడకు అనేక కంపెనీలు తీసుకువచ్చినట్లు తెలిపారు. నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు నరకం చూస్తున్నారని చెప్పారు. కరెంటు ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండి చేవెళ్లకు చేసింది గుండు సున్న అని విమర్శించారు. మతం, కులం పేరు మీద ఓట్లు అడుగుతున్న బీజేపీకి, హామీలను ఎగ్గొట్టిన కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఆమె కోరారు. రామాలయం కట్టామని బీజేపీ వాళ్లు చెబుతున్నారు.. మరి యాదగిరిగుట్టను కేసీఆర్ నిర్మించ లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ మాజీ మెంబర్ నర్సింహ, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్, మార్కెట్ మాజీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, ఎలుక మేఘనాథ్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ చైర్మన్ గోపిరెడ్డి విజేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి, కాకి దశరథ, అంజయ్యగౌడ్, బాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఇందిరమ్మ దేవేందర్, జయమ్మ రాజు, యూత్ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, కాసుల రామకృష్ణారెడ్డి, భూపాల్‌రెడ్డి, ఉదయ్, రామకృష్ణ, ప్రశాంత్‌చారి, అంజయ్య, దామోదర్‌గౌడ్, సామ ప్రకాశ్ రెడ్డి, యాదయ్య, పారిజాతం, దేవీలాల్ నాయక్, శ్రీహరి, మహేశ్వరం మండల అధ్యక్షుడు రాజునాయక్, హనుమగండ్ల చంద్రయ్య, చంద్రయ్య పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# పన్నెండు ఎంపీ స్థానాలు గెలుస్తున్నాం

- మతం పేరుతో ఓట్లడిగే పార్టీలకు గుణపాఠం తప్పదు
- హైదరాబాద్ అభివృద్ధి బీఆర్‌ఎస్‌కే సాధ్యం
- బీఆర్‌ఎస్ పార్టీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్, మే 8 : మతం పేరుతో ఓట్లు అడిగే పార్టీలకు తగిన గుణపాఠం చెప్పి అభివృద్ధికి పాటుపడే బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని గన్‌ఫౌండ్రి, బొగ్గులకుంట, నర్సరీబాగ్, వెస్లీ బాగ్, కందస్వామి లేన్, గుజరాత్ గల్లి, గడిఖానా, హనుమాన్ టేక్డీ తదితర ప్రాంతాలలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. అనంతరం గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పది సంవత్సరాల బీఆర్‌ఎస్ పాలనలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టినట్లు తెలిపారు. ఆయా పథకాల ద్వారా అనేక మంది లబ్ధి పొందారని, వారంతా బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌తో పాటు పన్నెండు పార్లమెంట్ స్థానాలలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాంచందర్‌రాజు, శీలం సరస్వతి, దిలీప్‌కుమార్ గనాతే, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.